మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్
& బాల్ పెన్నులు
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి.
అశోకాపెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)


సంతానము
గర్భాశయ వ్యాధులు
సుఖ ప్రసవము
సెక్స్ ఆంతరంగిక
సమస్యలు
మొలలు,చర్మవ్యాధులకు
అనుభవ చికిత్స
పోస్టుద్వారా చికిత్సకలదు.
సరోజ నర్సింగ్ హోమ్
డా. ఎస్. సరోజినీదేవి - డా. వి. మధు
(సెక్స్ స్పెషలిస్ట్స్)
H.O. శ్రీనివాసమహల్, గణపతిరావురోడ్, విజయవాడ-1
బ్రాంచి: కొత్తపేట, శీలంవారి వీధి, గుంటూరు




డాబా మీద పక్క వేసుకున్న మిత్రులింకా నిద్రపోనేలేదు, నడిజాము దాటినా! వూరికే ఆకాశంవంక చూస్తూ, ఎవరి ఆలోచనలో వాళ్ళున్నారు, ఆ వెన్నెల సోయగాన్నైనా ఆస్వాదించకుండా.

యెంతసేపయిందో వాళ్ళు కబుర్లు చెప్పుకోవడం మాని. మాటలు మరిచిపోయినట్లు, కాలం ఆగిపోయినట్లు — కదలక మెదలక శిలల్లా మాదిరిగా వుండిపోయినారు! చల్లని కాంతిని ధారాళంగా చల్లుతున్నట్టున్న చందమామ కానీ, మినుకు మినుకు మంటున్న చుక్కలు గానీ వాళ్ళనేమాత్రమూ రంజింపచేయటంలేదు.

డాబా చుట్టూరా చెట్లు — విరబోసుకున్న పట్టులాంటి జుట్టు అలలుగా కదిలినట్లు — గాలికి నిదానంగా కదులుతున్నాయి.

ఓ పక్కనుంచి సంపెంగ పూవులు వాసనల్ని విరజిమ్ముతున్నాయి. అంతెత్తున రాక్షసిలా పెరిగిన వేపచెట్టు శాఖలు డాబామీద వొంగి, చాలాభాగం వెన్నెలని కబళించి నీడ నిస్తూ వూగుతున్నాయి. గాలి వీచినప్పుడల్లా గల గలా కదిలి గుత్తులు గుత్తులుగా పండుటాకులు రాలి డాబా మీద పరుచుకుంటున్నాయి...యెంతటి వేసంకాలమైనా అంత చక్కటి వాతావరణంలో ఆ డాబా మీద మేను వాలిస్తే మనసలా తేలిపోతుంది.


యింకెప్పుడన్నా ఐతే సుందరం చాలా ఆహ్లాదకరంగా వుండేవాడే, ఆ ప్రశాంతతకి. కానీ ప్రొద్దుటినుంచీ అతను సీతయ్య గురించే ఆలోచిస్తున్నాడు, తెంపు లేకుండా ... తన ప్రయత్నమెట్లానూ ఫలవంతమౌతుంది. కానీ అది ఎంతవరకూ సబబు? స్నేహితుడి సంతోషానికి తను సైంధవుడి మల్లే ప్రవర్తిస్తున్నాడని గుంజాటన. అక్కడికి వీలుచిక్కిన ప్రతిక్షణం విడమరిచి మాట్లాడుతూనే వున్నాడు సీతయ్యతో. అతడు కొత్తగా మారిపోయిందేమీ లేదు. అప్పటి మనిషే. వొచ్చిన తేడా అల్లా వయసు వేడిగా వాడిగా పదును తేరటమే...

"మీరిద్దరూ ఇట్లా కలిసుండటం ఏం బాగాలేదు" అన్నాడు సుందరం చిట్టచివరికి, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"ఎవరికి బాగాలేందీ ?"

"ఎవ్వరికూ కాదను..."

"అయ్యో... యెందు కట్లాను. మేమంత కష్టాల్లో లేమే ? ... హాయిగా




సంతోషంగా వుంటేను! మేపుః సఖ్యంగా వుంటం అందరికీ రుచించటం లేదన్న మాట. ఐనా యవ్వరికో అసౌఖ్యమైతే మాకేమిటి లెద్దూ..."

"నీ చుట్టూవున్న సొసైటీ యేమను కుంటుంది?"

"యూవన్నా అనుకోనీ... సొసైటీని సంతోష పెట్టడం కోసమా యేమిటి మనం?"

"కాదేం? మనం పది మంది మధ్యా మసలటం లేదూ"

"అట్లాగైతె పది మంది మధ్యా మసలటం మాని, యెక్కడో వూరి చివరకు వెళ్ళి మసిలితే అప్పుడు అందరికీ బావుంటుందా?"

"కనీసం పెళ్ళి చేసుకుందావన్న ఆలో చనైనా వచ్చుండాల్సిందేనే."

"తనకిష్టం లేదు"

"యెందుకట్లా— పెళ్ళిచేసుకోకుండా యేం చేద్దామని? సంసారం, భర్తా, సుఖ శాంతులూ అక్కర్లేదూ?"

"ఇప్పుడు వాటికేవీ లోటు లేదను కుంటోందేమో..."

"మవ్వు భర్త వెట్లాగవుతావు?"

"ఏం? నాలో లోపం ఏం చూశావు" అంటూ పక్క మీదమంచి లేచాడు సీతయ్య. దాహమైనట్టుంది. తలగడ ప్రక్కనున్న మరచెంబు తీసి — గ్లాసులోకి నీళ్ళు వంపు కొని తాగాడు. మళ్ళీ వచ్చి పక్కమీద వొరిగాడు.

"లోపం లేదులే — పెళ్ళి చేసుకోకుండా భర్త వెట్లాగవుతావని?"

"భర్తని కాకపోతే ప్రియుణ్ణి! చాల దేవిటి?"

"యిట్లాంటి సంబంధం యేవన్నా బావుందా అసలు?"

"బాగోకేం..." కాసేపాగి అన్నాడు మళ్ళీ, "మనం మాటాడుకోడానికి ఇంకేవీ లేదా? ఏవన్నా కబుర్లు చెప్పరాదూ? అంత దూరం నుంచి వొచ్చావు. యిట్లాంటి వ్యర్థపు మాటలతో సమయాన్ని వృధా చేయడం దేనికి?"

"వ్యర్థపు మాటలన్నమాట"

"కాకపోతే వుపయోగ నేవిటి?... నువ్వెంత చెప్పినా నేను మారేవాడినా?"

"అంటే?"

"పోనీ లోకానికి వెరవొద్దు. తల్లిదండ్రు లన్నా లెఖ్ఖలేదా?"

"ఎందు కనుమానం? ఎప్పుడూ కూడా అట్లా ప్రవర్తించనిదే నేను."

"ఇది వాళ్ళను క్షోభ పెట్టదాని?"

సీతయ్య మాట్లాడలేదు. మళ్ళీ నిశ్శబ్దం.

సీతయ్య పేరు మాత్రమే అట్లా—ఎవరో పల్లెటూరి ఆసామిని స్ఫురణకు తెస్తుంది కానీ — అతనైతే చాలా నాజూకు మనిషి. అతన్ని చూసి ఎవరైనా అసలు వయసుకన్నా ఐదారేళ్ళు తక్కువ చేసే లెఖ్క కడతారు. సుందరం సరిగ్గా అందుకు భిన్నమైనమనిషి. పంతొమ్మిదవ యేటనే అతనికి పెళ్ళయింది. ముగ్గురు పిల్లల తండ్రి. పెద్దమనిషితరహాగా వుంటాడు. యిద్దరూ ముప్ఫయికి దగ్గర పడ్డవారే అయినా— యిద్దరి మధ్యా బోలెడు అంతరం కనిపిస్తుంది.

చాలా మంచి స్నేహితులు. బాల్యంనాటిది ఆ స్నేహం. వారి మనస్తత్త్వాల్లో వైవిధ్యం అధికం. ఆలోచనా పరిధిలో సామీప్యం బహు స్వల్పం.

సుందరం సొంత ఊర్లోనే స్థిరపడ్డాడు. సీతయ్య ఉద్యోగరీత్యా పట్నంరావాల్సివచ్చింది.

చాలాకాలం తరువాత వచ్చాడు సుందరం. సీతయ్యను చూసిపోదామనే కాదు అతనేవో విర్రాకాలు పోగిస్తున్నాడని సీతయ్య తల్లి దండ్రులు మొత్తుకుంటోండగా విని, అదేమిటో కళ్ళారా చూసి, కాస్త హితబోధ చేద్దామని వచ్చాడు. అతడు ప్రాక్టికల్ మనిషి. అనుమానం వొస్తే అంతే ఇక. ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించి– అప్పుడే దానికి యేర్పాట్లుకూడా చేసి వొచ్చాడు. ఒకవేళ తను విన్నది నిజం కాకపోయినా తను తీసుకున్న చర్యవల్ల అతని కుటుంబానికి వుపయోగమే కానీ నష్టం వుండదు.

ఆ అమ్మాయి పేరు సరోజట. ఆపిల్లను చూసి, యెంత ప్రయత్నం చేతనూ దురభిప్రాయం కలిగించుకోలేకపోయాడు సుందరం. చాలా ముచ్చట వేసింది. సీతయ్యకి చక్కగా యీడైన పిల్ల. వినమ్రత, మర్యాద, మన్ననా తెలుసును. అందరితోనూ పరిచయంగా మాట్లాడుతుంది. అనవసరపు సిగ్గులూ, వగలూ వంటి మిడిమేలపు వేషాలేవీలేవు. విడిగా వీట్లా వుంటారోకానీ– తన ముందు మాత్రం– మంచి స్నేహితులమల్లేనే ప్రవర్తించారు. మూడో వ్యక్తి ముందు తమ గొప్ప ప్రేమని బహిర్గత పరిచేందుకు పరాచికాలేవీ ఆడుకోలేమ!

## ఇదీ ప్రేమే !

అతనొచ్చి రెండ్రోజులే ఐంది. సీతయ్య ప్రాణ స్నేహితుడే ఐనా సరోజ ముందు మాత్రం చాలా సంకోచపడ్డాడు. కానీ అది కొద్ది గంటలే. కలివిడిగా మాట్లాడి సంకోచం పోగొట్టింది.

... గాజుల చప్పుడైంది. ఎవరో మెల్లెక్కి వస్తున్నట్లు అలికిడి. ఆ ఒస్తున్నది సరోజే నని విశదమైంది, ఇద్దరికీను. ఆ అమ్మాయితో వివరంగా మాట్లాడాలనుకున్నాడు సుందరం. లేచి కూర్చున్నాడు.

సీతయ్య ప్రక్కన వొచ్చి కూర్చున్నది సరోజ.

"అబ్బబ్బ, ఈ దోమలు విసుగూ విరామమూ లేకుండా చంపేస్తున్నాయి. నిద్ర రావటంలేదు !...యింకా మీరు కూడా మెలుకువతో వున్నారేం" ... యెవ్వరూ సమాధానం చెప్పకపోయేసరికి తనే మాట్లాడింది మళ్ళీని,

"మీ వూరి కబుర్లేవన్నా చెప్పండి సుందరంగారూ"

యెంతచక్కగా, స్వచ్ఛంగా మాట్లాడుతోంది–అనుకుని పైకి "ఊఁ" అన్నాడు సుందరం.

"మీరు రాసిన ఉత్తరం అందిందటవా మీ వాళ్ళకి" సీతయ్యని అడిగింది.

"యేమో"

"యితగాడు కనీసం క్షేమసమాచారమైనా వ్రాయడని మొత్తుకుంటారమ్మా వాళ్ళు" ఫిర్యాదు చేశాడు సుందరం.

"మీరు రావటానికి రెండురోజుల ముందు చాలా పెద్ద వుత్తరం వివరంగా వ్రాశారు. అది అందిందో లేదో ?"

"యేమిటి, వివరాలు ?"

"అదే, వాళ్ళ అమ్మా నాన్నా యెట్లాగూ పెద్దవారైపోయినారుగదా. వాళ్ళను ఆదరించాల్సిన ధర్మం తనదే. చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు కూడా చేయాలాయెను. యింకా అక్కడ వుండి చేసేదేముంది – యిక్కడికొచ్చేయమని వ్రాశారు."

సుందరం ఆశ్చర్యపడ్డాడు.

"యిక్కడ వుండటానికి వాళ్ళు వొప్పకోవద్దూ ?"

"యేమో, వాళ్ళకి వేరేయిల్లు తీసుకుంటారట"

"రెండిళ్ళా ... వాళ్ళు వూరుకుంటారనే మీ నమ్మకం ?" కాసేపాగి అన్నాడు మళీని, "పోతే బాధ్యతలు తీర్చుకోవాలన్న చింతన వుందన్నమాట వీడికి... చూడమ్మా నీతో కాస్త వివరంగా మాట్లాడాల్సుంది యేమనుకోవు గదూ."

సరోజ మాట్లాడలేదు. ఆమె కర్థమైనట్లుంది, దించిన తల యెత్తలేదు.

"తెగింపుచేసి యిట్లా వుంటున్నారు సరే. భవిష్యత్తు గురించి యేమన్నా ఆలోచిస్తున్నారా ?"

చాలాసేపటికి గొంతు పెగుల్చుకుని అంది, "రేపటి సంగతి ఆలోచించాలన్న వుద్దేశం లేనిదే అసలు !... యిప్పటికిట్లా హాయిగా వుంటున్నాం అంతే. భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఈమాత్రం నిశ్చింత వుంటుందా? ...యెవరూ హర్షించరని తెలుసు నేను దెబ్బలు తినీ తినీ బండబారాను. లోకాన్ని లెక్క చెయ్యని తనం చిన్నవిషయమై పోయింది.

"పెళ్ళి చేసుకుని ధైర్యంగా బతకొచ్చునే..." అతనట్లా అడగటంలో నిజాయితీ యేమీ లేదు.

"యిప్పుడు మీరింత దూరం ప్రయాసపడి వొచ్చి – యెందుకింత యిదవుతున్నారో, అందుకే ఆ ధైర్యం లేకపోయింది."

"అర్థం కాలేదు. వాడు యేబాదర బందీ

## ఆరల్ సముద్రం ఉల్కాపాతం వల్ల ఏర్పడిందా ?

4 కోట్ల సంవత్సరాల క్రితం మధ్యాసియా ప్రాంతంపై బ్రహ్మాండమైన ఉల్కాపాతం వల్లగాని, గ్రహ పాతంవల్లగాని ఆరల్ సముద్రం ఏర్పడింది. సోవియట్ విజ్ఞానశాస్త్ర పరిషత్ భూగర్భశాస్త్ర సంస్థకు చెందిన ఆచార్య ఓలెగ్ బోరిసోవ్ ఈ శాస్త్రీయ వూహాగానం చేశారు

సముద్ర గర్భంపై జరిపిన భూభౌతిక పరిశోధనలు, వ్యోమ తలంనుండి తీసిన ఛాయా చిత్రాలు సమకూర్చిన వివరాలు ఆధారంగా యీ వూహాగానం చేయబడింది. ఉల్కా పాతంవల్ల పడిన గుంట మూలంగా ఆరల్ సముద్రం రూపుదాల్చినట్లు కన్పిస్తున్నది. కొద్ది సెకనుల పాటు కలిగిన అత్యంత శక్తివంతమైన వత్తిడి మూలంగా కఠిన శిలలు నుగ్గునూచమైపోగా యీ పెద్ద గుంట ఏర్పడినట్లు తోస్తున్నది. సముద్రతలం రూపాన్ని పరిశీలిస్తే ఉల్క, లేదా గ్రహం గాలిలోనే పేలిపోయి కొన్ని లక్షల టన్నుల బరువుగల శిలా పదార్థం పతనం వల్ల యీ సముద్రం ఏర్పడి వుండవచ్చునని తోస్తున్నది. ఆరల్ సముద్రతలంలో కన్పించిన నొక్కివేయబడ్డ కఠిన శిలలవంటివే, యీ సముద్రం నుండి 700 కిలోమీటర్ల దూరంలో వున్న ప్రాంతంలో కూడా కన్పించాయని బోరిసోవ్ టాస్ విలేఖరికి తెలిపారు.

లేని స్వతంత్రుడైతే నాకీ గుంజాటన లేక పోను"

"సరిగా నేను ఆలోచించిందీ అదే. పెళ్ళి కిదిగిన చెల్లెళ్ళున్నారు. అన్నయ్య యిలాంటి వాడని తెలిస్తే సంబంధాలు రావేమోననేగా మీ భయం. మరి మేవు కులాంతరవివాహం చేసుకుంటే– అప్పుడైనా యిబ్బందేగా."

"ఇన్ని సమస్యలున్నాయని ఆలోచించ గలిగినప్పుడు యింతవరకూ రానివ్వకుండా వుండాల్సింది."

"ఆ జాగర్త పడాల్సింది వాళ్ళ పెద్ద వాళ్ళే. వయసొచ్చిన ఆడపిల్లల్ని వదిలించు కుందామనే కాని, మగపిల్లాడిక్కూడా పెళ్ళి అవసరమని తెలుసుకోరెందుకో."

"వాళ్ళు తెలుసుకోలేక పోయారు కాబట్టి, ఋటా చేయడవే"

"అలాగని కాదు. ఎక్కువమంది తెగించ లేరు. తను చేసిందదే. ఇప్పటికి మాత్రం మునిగిపోయిందేముంది? వాళ్ళ కుటుంబా న్నుంచి ఆయన్ని దూరం చేయాలన్న దుర్మార్గపు ఆలోచన లేదు నాకు. అట్లా ఆలోచించివ దాన్నయితే పెళ్ళే చేసుకునే వాళ్ళం."

"అక్కడ వాళ్ళ దిగులంతా వీడి గురించే. ఈ విషయం వాళ్ళకెటాగో తెలిసింది. పెద్దతనంలో వాళ్ళకీ అశాంతి యేవిటిపాపం! సాధ్యమైనంత వేగంగా పెళి చేసేయాలను కుంటున్నారు. నీ అభిప్రాయం యేవిటి?"

సరోజ మాట్లాడలేదు. కళ్ళు విలిచి చూపిందతన్ని. గుండెలో నిదానించి ఓ అగ్ని పర్వతం బద్దలవుతోంది తలతిప్పి సీతయ్యను చూసింది. అతనెప్పుడో నిద్రలోకి జారి పోయాడు. కుడి మోచేయి తల క్రింద పెట్టుకుని విడమచేతో ఆమె ముంజేతి గాజులను సవరిస్తున్నట్టు అతని వేళ్ళు.

ఆ క్షణంలోనే ఫెళాఫెళామని ఆలోచనలు. యేవిటి జరగబోతోంది? తన చెలికాడు దూరమైతుడా? నిజమేనా? ఇదొక పరీక్షా?

అవును–అతనికి తనెంత ప్రాణమో, తన తల్లి దండ్రులూ, చెల్లాయిలూ... అంతే! తను బ్రతగ్గలదా? ఇక యీ బంధం యింతేనా?

ఆలోచనల ఉధృతి తగ్గనే లేదు.

"అడ్డుపడేందుకు నాకు హక్కేది. ఆ యింటికో కోడలు కావాలికదూ మరి"

# ఇదీ ప్రేమే !

తడబడుతూ అన్నది. పెదిమలు వణుకు తున్నాయి. వొక్కి పడుతోంది.

సుందరం ఆమె మొగం చూడలేక పోయినాడు. అతనికి తెలుస్తోంది ప్రతిధ్వని

"వాడి కిష్టమైనా కాకపోయినా–వాళ్ళు వాళ్ళ తృప్తికోసమైనా పెళ్ళికి వప్పుకుంటా డన్న నమ్మకం వుంది. నీకు అన్యాయం జరుగుతోందని వ్యధ పడొచ్చు కానీ ఇది అతని ధర్మం కదా..."

"తనతో మాట్లాడేరా మరి?"

"ఇంకా లేదు. నీ గురించే ఆలోచిస్తున్నా వమ్మా. నీ సంగతులేవీ తెలీవు నాకు. తల్లి దండ్రులు ఎక్కడున్నారో యేవిటో– నీ సమస్యలేవిటో యేవీ చెప్పలేదు వాడు. తర్వాత యేం చేస్తావో మరి?"

"చేద్దామనుకున్న ప్రకారం జరగవు కదండీ. ముందే చెప్పలేదూ–రేపటి గురించి ఆలోచన లేదు. ఏం జరిగినా యింతకన్నా ఉపద్రవం ముంచుకురాదు. యెప్పటి మల్లేనే తెల్లారుతుంది సూర్యోదయమూ, మిట్ట మధ్యాహ్నమూ, సాయంకాలమూ, చుక్కలూ, చందమామా– అంతా చాలా సహజంగానే జరుగుతాయి. అంత సహజంగానే యీ కష్టాలూను.

"... ... ... ..."

"నిద్దొస్తోంది. ఇంక వెళ్ళి పడు కుంటాను" లేవబోయింది.

"ఇంకొక్క సంగతి విని పోదువుగాని వొక్క నిముషం"

అక్కడుండి నిగ్రహించుకోవడం కష్టంగా వుంది ఆమెకు.

"రేపు మధ్యాహ్నం బండికి వెళతాన్నేను" అన్నాడు తను చుక్కల్ని చూస్తూ.

"... ... ... ..."

"నువ్వు నన్ను మన్నించాలమ్మా– వీడి సుఖసంతోషాలే గాక– కుటుంబ ప్రతిష్ఠ గూడా ముఖ్యం గనుక– తప్పనిసరైంది"

సుందరం సరిగా చెప్పలేకపోతున్నాడు. అంత వరకూ సవ్యంగా మాటాడిన వాడల్లా యిప్పుడు బిగుసుకుపోయాడు.

"చె.. ప్పం... డి."

"యేంలేదు, సీతయ్య మా వారు వచ్చేస్తున్నట్టే. తప్పదు ... వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని అతని వుద్యోగం ... ట్రాన్స్‌ఫర్ చేయించాము ! ... యింకో నాలుగయిదు రోజుల్లో ఆర్డర్సు అందుతాయి. అతనిక తప్పించుకునేందుకు త్రోవలేదు" ఆ మాట నెట్లాగో అనేసి తలెత్తి చూశాడు.

సరోజ అక్కడలేదు !

గబ గబా వెళ్ళిపోతోంది లేచి. వేగంగా మెట్లు దిగుతున్నట్టు మట్టిగాజులు గల గలా మని చప్పుడు...

...అంటే, మళ్ళీ నిశ్శబ్దం...

యెంతసేపో–అటాగే డాబా పిట్టగోడకు ఆనుకొనివట్టు కూర్చుండిపోయాడు. నిద్ర పట్టేటట్టు లేదు.

ఆగి ఆగి చెట్ల ఆకులు మాటాడు కోవడం తప్పించి అలికిడిలేదు.

సుందరానికి తన గుండె చప్పుడు వినపడు తోంది, ఆ శాంత వాతావరణంలో. తన అంతరాత్మ చేసే చప్పుడే తెలీకుండా వుంది; తను చేసింది శుభకార్యమా ? దుర్మార్గమా అది !

## ప్రాస గోల

పుడమిపై జీవుడు
పడగానె గోల !
పుట్టాక ఎందుకని
పరితాప మేల !
కష్టమొస్తే గోల
కాటికెళితే గోల
ముష్టికెళితే గోల
మూట కడితే గోల !
పిల్లలుంటే గోల
పిల్లకంటే గోల
డబ్బులేని గోల
డబ్బులుండి గోల !
పదవి పోయినందుకు గోల
పరీక్ష తప్పినందుకు గోల
పాపం చేశావనే గోల
ఎందుకు పుట్టావనే గోల !
ఎందెందు వెదికినా ఒకే గోల
అదే అదే పాడు గోల !!

— మంతెన సూర్యనారాయణరాజు